# వజ్రసూచికోపనిషత్తు

– డా. పైడిపాటి వేంకటా చలపతి

**ఉపోద్ఘాతము :**

చిద్రూపునకు, సదానందస్వరూపునకు, సమస్తజీవుల బుద్ధివృత్తుల సాక్షి స్వరూపునకు, వేదాంతవేద్యునకు, అనంతరూపునకు, పరబ్రహ్మమునకు నమస్కారము అన్నమంగళంతో ఈ ఉపనిషత్తు ప్రారంభింపబడుతుంది.

అజ్ఞానమును ఛేదించునది, జ్ఞానచక్షువులు కలిగిన వారికి ఆభరణమై ప్రకాశించునది, ఆత్మజ్ఞానప్రతిపాదకమైనది అయిన వజ్రపు సూచికతో (సూదితో) సమానమైన విషయాన్ని ప్రస్తావించుకుందామని, సందేహనివృత్తికై వచ్చిన శిష్యులకు గురు–శిష్య సంవాదరూపంగా ఈ ఉపనిషత్ చెప్పబడింది. ఈ ఉపనిషత్తులో ప్రధానంగా బ్రాహ్మణశబ్దం గురించి తాత్త్విక, ఆధ్యాత్మికార్థపూర్వకంగా వివరింపబడి ఉంది. ఇక్కడ **బ్రాహ్మణుడు పూజనీయుడు** అను విశేషము వజ్రసూచికము అన్న పేరుతో చెప్పబడుతోంది. వజ్రసూచి = ఇంద్రుని వజ్రాయుధము వలె అపార్థములను, అల్పార్థములను, అల్పజ్ఞానదోషమును ఖండించి పరమార్థమును ప్రసాదించునది.

**తేషాం వర్ణానాం బ్రాహ్మణ ఏవ ప్రధాన – ఇతి వేదవచనానురూపమ్. స్మృతిభి అపి యుక్తమ్.** చాతుర్వర్ణ్యములలో బ్రాహ్మణులు ప్రధానులు అని వేదవచనరూపంగా, స్మృతులలోను, ఇతిహాసపురాణములలోను ప్రసిద్ధంగా చెప్పబడింది. మరి **కోవా బ్రాహ్మణో నామ** అని వేద–పురాణ–ఇతిహాసములలోచెబుతున్న బ్రాహ్మణుడు ఎవరు ? బ్రాహ్మణుడన్న పేరుతో ఎవరిని చెబుతూ ప్రధానుడు అని అంటున్నారు ?

❖ **కః జీవః ?** అతడు అందరివంటి జీవుడేనా ? కాదా ? ఏ జీవుడు బ్రాహ్మణునిగా చెప్పబడుతున్నాడు ?

- **కిం దేహః ?** దేహము దృష్ట్యా అనగా జన్మతః బ్రాహ్మణునిగా చెప్పబడుతున్నాడా ?
- **కిం జాతిః ?** జాతి చేత ఒకరు బ్రాహ్మణుడని చెప్పడం వేద, స్మృతుల ఉద్దేశ్యమా ?
- **కిం జ్ఞానం ?** ఒకని జ్ఞానమును అనుసరించి అతడు బ్రాహ్మణ పదానికి అర్హుడా ?
- **కిం కర్మ ?** ఈ ఈ కర్మలు నిర్వర్తించు వారు బ్రాహ్మణులు. కర్మల చేత బ్రాహ్మణులు అవుతున్నారన్నది వేద, స్మృతుల అభిప్రాయమా ?
- **కిం ధార్మికః –** ఒకరు ఆచరించే దానధర్మాది గుణములననుసరించి బ్రాహ్మణుడని నిర్వచనమా ?

ఈవిధంగా వేద, స్మృతులలో బ్రాహ్మణుడు అనగా ఎవరు అన్న శిష్యుని సందేహనివృత్తికై గురువు గారు తెలిపిన అధ్యాత్మ శాస్త్రార్థపూర్వకమైన సమాధానమే ఈ వజ్రసూచికోపనిషత్.

జీవులలో జన్మానుసారము మొట్టమొదట జన్మించినవాడు బ్రాహ్మణుడు అని అందామంటే జీవులందరి జన్మలు సమమైనవే కనుక బ్రాహ్మణుడు మొట్టమొదట జన్మించినవాడు అన్న సమాధానం సరియైనది కాదు.

జీవుడు దేహము కాదు. **అతీతాన్ ఆగతాన్ అనేక దేహానాం జీవస్య ఏకరూపత్వాత్ –** జీవుని పట్ల అనేక దేహములు గడిచిపోయినాయి, రాబోతున్నాయి. ఇలా జీవునికి అనేక దేహములు సమానమైనవే కాని ఒక దేహము బ్రాహ్మణదేహము, మరొకటి బ్రాహ్మణదేహం కాదు అని దేహికి ఉండదు. జీవుడు సర్వదా ఒక్కడై అతని కర్మవశంగా అనేక దేహాలు సంభవిస్తూ ఉంటాయి. జీవుడు పొందే అన్ని దేహములలోనూ జీవుడు ఏకరూపుడే కాని ఒక్కొక్క దేహంలో ఒక్కొక్క రూపునిగా ఉండడు. కనుక ఒక దేహాన్ని ఉద్దేశించి బ్రాహ్మణుడు అని చెప్పలేము. ఏ మనుష్య

దేహమైనా పంచభూతములచేతనే నిర్మింపబడుతున్నది. భౌతిక దేహములన్నింటికీ జరామరణములు, జన్మకర్మధర్మములు సమానములు. కనుక దేహమును బట్టి బ్రాహ్మణుడు కాదు. నాలుగు వర్ణాలకు వర్ణాలను (రంగులను) శాస్త్రములు వేదములు నియమించలేదు కనుక వర్ణము (రంగు) చేత బ్రాహ్మణుడు అని చెప్పలేము.

పరమసత్యమును సిద్ధించుకున్న జాతిసంబంధరహితులైన సుప్రసిద్ధ ఋష్యశృంగ, కౌశిక, జంబుక, వాల్మీకి, వ్యాస, గౌతమ, వశిష్ఠ, అగస్త్యాది మహర్షులు జన్మతః బ్రాహ్మణులు కానప్పటికీ బ్రాహ్మణశబ్దం చేత గౌరవింపబడుతున్న వారే కనుక జాతి చేత ఒకడు బ్రాహ్మణుడు అనడానికి వీలు లేదు. జ్ఞానము చేత బ్రాహ్మణుడు అని కూడా సిద్ధాంతీకరించలేము. సమస్త ప్రాణులు ప్రారబ్ధ, ఆగామి, సంచిత కర్మలను అనుసరించి ఆయా కర్మల ప్రేరణను, సాధర్మ్యమును కలిగి ఉంటారు కనుక ఒకరు నిర్వర్తించు కర్మలను అనుసరించి బ్రాహ్మణుడు అని చెప్పలేము. క్షత్రియులలో అనేకమంది ధర్మనిరతులు ఉన్నారు కనుక ధార్మికుడైన వానిని బ్రాహ్మణుడు అని అనలేము.

మరి బ్రాహ్మణుడు అన్న శబ్దము చేత ఎవరిని పిలువగలుగుతాము ? శబ్దార్థానికి ఎవరు సరిపోతారు ? ఎవరైతే స్వస్వరూపము గురించి ఈ విధంగా అనుకుంటాడో అతడే బ్రాహ్మణుడు.

ఈ సర్వము అఖండమైన ఆత్మయే. కనుక సర్వులు ఆత్మస్వరూపులే. పరమాత్మకు అనన్యమైనది ఏదీ లేదు. నీవు – నీది, నేను – నాది అనబడేదంతా సర్వాత్మకుడైన పరమాత్మకు చెందినదే. జాతి–గుణ–క్రియలకు అతీతమైన ఆత్మయే ఎవనికి సర్వత్ర స్వానుభవమౌతుందో అతడే బ్రాహ్మణుడు. దేహమునకు చెందిన షడూర్ములైన ఆకలి, దప్పిక, శోకము, మోహము, జరా, మరణములు దేహమునకేకాని ఆత్మకు కావు. షడ్భావములు భౌతికమైన దేహానికేకాని ఆత్మకుకావు. మనమంతా సత్య–

జ్ఞాన–ఆనంద–అనంతస్వరూపులమని భావనకలిగి, బాహ్యాభ్యంతరాలలో ఆకాశము వ్యాపించిన తీరుగా ఆనందస్వభావమగు ఆత్మానందమే సర్వమూఅని అనుభూతి చెందిన వాడు బ్రాహ్మణుడు. దేహ–దేహిలతో సంబంధబాంధవ్య అనుబంధములతో కూడిన మనో–చిత్త–బుద్ధి–అహంకార ప్రదర్శనలతో ఆత్మకు ఎలాంటి సంబంధము లేదు అని గ్రహించి సర్వత్ర ఆత్మీయదృష్టిని కలిగిన వాడు బ్రాహ్మణుడు.

స్వభావంగా కామము, రాగము మొదలైన దోషములు లేనివాడు. శమము (అంతరింద్రియనిగ్రహము), దమము (బాహ్యేంద్రియనిగ్రహము) కలిగిన వాడు. మాత్సర్యము, తృష్ణ, ఆశ, మోహములు లేనివాడు. ఆత్మదృష్టి యొక్క స్వాభావిక ప్రయోజనంగా దంభ, దర్ప, అభిమాన, క్రోధ, పారుష్య, అజ్ఞాన, ఆభిజాత్య, అహంకారాది ఆసురీసంపత్తిరహితుడు. ఇట్టి ఆత్మభావితమైన సద్గుణములను, స్వాభావ సర్వాతీత లక్షణములను కలిగిన వాడే బ్రాహ్మణుడు. ఇదే శ్రుతులు, స్మృతులు, పురాణములు, ఇతిహాసములు, వేదములు బ్రాహ్మణశబ్దార్థము పట్ల కలిగి ఉన్న ఉద్దేశ్యము. కేవల శాస్త్రజ్ఞానము చేతనో, కర్మల చేతనో, జాతి చేతనో, జన్మ చోతనో, బ్రాహ్మీదృష్టిచే అనన్యమైన భావన దృష్టి అవగాహనను లేని వానికి బ్రాహ్మణత్వము లభించదు అని ఈ ఉపనిషత్తులో బ్రాహ్మణశబ్దతత్త్వం ప్రతిపాదింపబడింది.

అలాంటి బ్రాహ్మీస్థితి సమన్వితమైన బ్రాహ్మణత్వం సిద్ధించడానికి మార్గమేమిటి అని శిష్యుడు ప్రశ్నించగా, పైన తెలిపిన సత్, చిత్, ఆనందరూపమైన ఆత్మయొక్క విశేషలక్షణముల అభ్యాసమే అందుకు ఉపాయము. అభ్యాసము అనగా నీవుగా, జగత్తుగా కనిపించేదంతా సచ్చిదానంద ఆత్మకు అద్వితీయమని, ఇదంతా ఆత్మయే అన్న భావనను అభ్యాసపూర్వకంగా ఆశ్రయించాలి. **ఆత్మానం సచ్చిదానందం బ్రహ్మభావయేత్ –** సర్వత్రా బ్రహ్మము యొక్క సందర్శనమే బ్రాహ్మణత్వము. అఖండము, అప్రమేయము, సర్వదా స్వస్వరూపము అయిన బ్రాహ్మీభావాన్ని

ఆశ్రయించడం చేత బ్రాహ్మీస్థితి సిద్ధించి, జీవుడు వేద, ఇతిహాస, పురాణ, స్మృతి ఉద్దేశ్య పరమార్థమైన బ్రహ్మణశబ్దార్థానికి అర్హుడౌతున్నాడు.

ఈ విధంగా బ్రాహ్మీదృష్టిని స్వాభావికము, అనుక్షణికము చెసుకోవాలన్న పరమార్థాన్ని ఈ ఉపనిషత్తులో చక్కగా వివరింపబడింది.

స్వస్తి

# వజ్రసూచికోపనిషత్

శ్లో. యజ్ఞా నాద్యాంతి మునయో బ్రాహ్మణ్యం పరమాద్భుతం ।
తత్రైపదబ్రహ్మతత్త్వమహమస్మీతి చింతయే ॥

ఓం సహనావవతు । సహ నౌభునక్తు । సహవీర్యం కరవావహై ।
తేజస్వినావధీతమస్తు । మా విద్విషావహై ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**అథ వజ్రసూచికోపనిషత్ ప్రారంభః**

చిత్సదానందరూపాయ సర్వధీవృత్తిసాక్షిణే ।
నమో వేదాంతవేద్యాయ బ్రహ్మణేఽనంతరూపిణే ॥

ఓం వజ్రసూచీం ప్రవక్ష్యామి శాస్త్రమజ్ఞానభేదనం ।
దూషణం జ్ఞానహీనానాం భూషణం జ్ఞానచక్షుషామ్ ॥ ॥ 1 ॥

బ్రాహ్మక్షత్రియవైష్యశూద్రా ఇతి చత్వారో వర్ణాస్తేషాం వర్ణానాం బ్రాహ్మణ ఏవ ప్రధాన ఇతి వేదవచనానురూపం స్మృతిభిరప్యుక్తం ।
తత్ర చోద్యమస్తి కో వా బ్రాహ్మణో నామ కిం జీవః కిం దేహః కిం జాతిః కిం జ్ఞానం కిం కర్మ కిం ధార్మిక ఇతి ॥

తత్ర ప్రథమో జీవో బ్రాహ్మణ ఇతి చేత్ తన్న । అతీతానాగతానేకదేహానాం జీవస్యైకరూపత్వాత్ ఏకస్యాపి కర్మవశాదనేకదేహసంభవాత్ సర్వశరీరాణాం జీవస్యైకరూపత్వాచ్చ । తస్మాత్ న జీవో బ్రాహ్మణ ఇతి ॥

తర్హి దేహో బ్రాహ్మణ ఇతి చేత్ తన్న । ఆచండాలాది పర్యంతానాం మనుష్యాణాం పంచభౌతికత్వేన దేహస్యైకరూపత్వాత్ జరామరణధర్మాధర్మాది సామ్యదర్శనత్ బ్రాహ్మణః శ్వేతవర్ణః క్షత్రియో రక్తవర్ణో వైశ్యః పీతవర్ణః శూద్రః కృష్ణవర్ణః ఇతి నియమాభావాత్ ।

పిత్రాదిశరీరదహనే పుత్రాదీనాం బ్రహ్మహత్యాదిదోషసంభవాచ్చ ।
తస్మాత్ న దేహో బ్రాహ్మణ ఇతి ॥

తర్హి జాతి బ్రాహ్మణ ఇతి చేత్ తన్న । తత్ర జాత్యంతరజంతుష్వనేకజాతిసంభవాత్ మహర్షయో బహవః సంతి । ఋష్యశృంగో మృగ్యాః, కౌశికః కుశాత్, జాంబూకో జాంబూకాత్, వాల్మీకో వాల్మీకాత్, వ్యాసః కైవర్తకన్యకాయాం, శశపృష్ఠాత్ గౌతమః, వసిష్ఠ ఉర్వశ్యాం, అగస్త్యః కలశే జాత ఇతి శృతత్వాత్ । ఏతేషాం జాత్యా వినాప్యగ్రే జ్ఞానప్రతిపాదితా ఋషయో బహవః సంతి । తస్మాత్ న జాతి బ్రాహ్మణ ఇతి ॥

తర్హి జ్ఞానం బ్రాహ్మణ ఇతి చేత్ తన్న । క్షత్రియాదయోఽపి పరమార్థదర్శినోఽభిజ్ఞా బహవః సంతి । తస్మాత్ న జ్ఞానం బ్రాహ్మణ ఇతి ॥

తర్హి కర్మ బ్రాహ్మణ ఇతి చేత్ తన్న । సర్వేషాం ప్రాణినాం ప్రారబ్ధసంచితాగామికర్మసాధర్మ్యదర్శనాత్కర్మాభిప్రేరితాః సంతో జనాః క్రియాః కుర్వంతీతి । తస్మాత్ న కర్మ బ్రాహ్మణ ఇతి ॥

తర్హి ధార్మికో బ్రాహ్మణ ఇతి చేత్ తన్న । క్షత్రియాదయో హిరణ్యదాతారో బహవః సంతి । తస్మాత్ న ధార్మికో బ్రాహ్మణ ఇతి ॥

తర్హి కో వా బ్రహ్మణో నామ । యః కశ్చిదాత్మానమద్వితీయం జాతిగుణక్రియాహీనం షడూర్మి షడ్భావేత్యాదిసర్వదోషరహితం సత్యజ్ఞానానందానంతస్వరూపం స్వయం నిర్వికల్పమశేషకల్పాధారమశేషభూతాంతర్యామిత్వేన వర్తమానం అంతర్బహిశ్చాకాశవదనుస్యూతమఖండానంద స్వభావమప్రమేయం అనుభవైకవేద్యమపరోక్షతయా భాసమానం కరతళామలకవత్సాక్షాదపరోక్షీకృత్య కృతార్థతయా కామరాగాదిదోషరహితః శమదమాదిసంపన్నో భావ మాత్సర్య

తృష్ణా ఆశా మోహాదిరహితో, దంభాహంకారాదిభిరసంస్పృష్టచేతా వర్తతే ఏవ ముక్తలక్షణో యః స ఏవ బ్రాహ్మణేతి శృతిస్మృతి ఇతిహాసపురాణాభ్యామభిప్రాయః అన్యథా హి బ్రాహ్మణత్వసిద్ధిర్నాస్త్యేవ । సచ్చిదానాందమాత్మానమద్వితీయం బ్రహ్మ భావయేదిత్యుపనిషత్ ॥

ఓం సహనావవతు । సహ నౌభునక్తు । సహవీర్యం కరవావహై ।
తేజస్వినావధీతమస్తు । మా విద్విషావహై ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**ఇతి వజ్రసూచ్యుపనిషత్సమాప్తః**